సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం : 8 : జనవరి : 2025

I



టీడీపీ వర్గీయుల గుప్పిట్లో వసతి గృహాల టెండర్లు

కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లలో సరుకులు, కూరగాయల పంపిణీకి జరిగిన టెండర్ల ప్రక్రియ టీడీపీ వర్గీయుల గుప్పిట్లో సాగింది. - IIలో



ఘనంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాల ప్రారంభం

ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏయూ క్యాంపస్ ఆవరణలో అత్యంత సుందరంగా వేదికను నిర్మించారు. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.150
రెండోరకం	రూ.90	రూ.110

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్) : జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీ, కాపు, ఈబీసీ వారికి కేటాయించిన లక్ష్యాలకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వహణ సంచాలకురాలు డి.శిరీషా ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి పథకం కింద జిల్లాలో 1907 యూనిట్లు ఉన్నాయన్నారు. అలాగే ఈబీసీకి చెందిన నిరుద్యోగ యువతకు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో 57 యూనిట్లు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కౌలు రైతులు పంట రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి టౌన్ : జిల్లాలోని కౌలు రైతులు పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎల్‌డీఎం ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని ఏదైనా బ్యాంకులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణాలు పొందే క్రమంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే 08561-293903 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

డీఆర్‌పీ పోస్టుల భర్తీకి అర్హులకు అవకాశం

రాయచోటి (జగదాంబసెంటర్) : పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ)లో జిల్లా రీసోర్స్ పర్సన్(డీఆర్‌పీ) పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్, ఇంటర్నెట్ రంగంలో ప్రావీణ్యం కలవారు ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182345972, 9676736623, 9618971075 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయం రూ. 2,29,555

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. దాదాపు రూ. 2,29,555 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒక నెల రోజుల హుండీని లెక్కించామన్నారు. మొత్తం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్స్ అధికారి మల్లారెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

9న రాజంపేటకు హర్యానా గవర్నర్ రాక

రాయచోటి : ఈనెల 9న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాజంపేటకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. రాజంపేటలోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ విద్యాసంస్థ సిల్వర్ జూబ్లీ కార్యక్రమం, అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవంలో గవర్నర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు కేంద్ర కరువు బృందం పర్యటన

బి.కొత్తకోట : కేంద్ర కరువు బృందం బుధవారం తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో పర్యటించనుంది. ఢిల్లీ నుంచి బెంగళూరు మీదుగా ఈ బృందం మంగళవారం రాత్రికి బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ చేరుకుటుంది. ఇక్కడ బస చేసి బుధవారం ఉదయం 9 గంటలకు పర్యటన ప్రారంభిస్తుంది. కేంద్ర ప్రభుత్వ పాలసీ, కోఆర్డినేషన్స్ విభాగం సంయుక్త కార్యదర్శి పెరిన్‌దేవి నాయకత్వంలో బృంద సభ్యులైన డిప్యూటి డైరెక్టర్ సుప్రియా మాలిక్, నీతి ఆయోగ్ పరిశోధనా అధికారి అనురాధ బటనా, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం డిప్యూటీ అడ్వైజర్ ఆశిశ్ పాండేలు కరువు పరిస్థితులను పరిశీలిస్తారు. ఉదయం 9.45 గంటలకు బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట ఆర్బీకే వద్దకు బృందం చేరుకుంటుంది. ఇక్కడ అధికారులు ఏర్పాటు చేసిన కరువు ఫొటోల ప్రదర్శన తిలకించాక రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. 10.05 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి తంబళ్లపల్లె మండలంలోని కోటకొండకు చేరుకుని 10.40 గంటల నుంచి 11 గంటల వరకు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. కురబలకోట మండలంలోని మట్లివారిపల్లెలో 11.15 గంటల నుంచి 11.35 గంటల వరకు రైతులతో నేరుగా మాట్లాడతారు. తర్వాత పీలేరు నియోజకవర్గం వాయల్పాడు మండలంలోని జంగావారిపల్లెలో 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు రైతులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12.35 గంటల నుంచి 12.55 గంటల వరకు మదనపల్లె నియోజకవర్గంలోని చిన్నతిప్పసముద్రంలో రైతులతో ముఖాముఖి అయ్యాక అక్కడి నుంచి మదనపల్లెకు బయలుదేరి వెళ్తారు. కాగా తొలుత కేంద్ర బృందం పర్యటన మూడు గంటల పాటు కొనసాగుతుందని ప్రకటించారు. అయితే చివరకు ఒకటిన్నర గంటకు కుదించారు. అంటేఈ బృందం పర్యటించే ప్రతిచోట 20 నిమిషాలు మాత్రమే కేటాయించారు.



హార్సిలీహిల్స్ చిరుతల ఆవాసం



- ఐదు రోజుల క్రితం రాయచోటి, మదనపల్లె వాసులకు కనిపించిన రెండు వేర్వేరు చిరుతలు
- వీటి సంఖ్య ఐదుకు పెరిగినట్టు అంచనా
- ఏడాదిగా సందర్శకులకు కనిపిస్తూనే ఉన్నాయి

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్ చుట్టూ ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో మనుగడ సాగిస్తున్న చిరుతల సంఖ్య ఐదుకు చేరాయన్న అంచనాకు అటవీశాఖ వచ్చింది. దీంతో వీటి మనుగడకు ఇబ్బందులు తలెత్తకుండా, వన్యప్రాణులకు హాని కలగని విధంగా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏడాదిగా చిరుతల సంచారం అధికం కావడం, కనిపిస్తున్న చిరుతలు ఒకలా కాకుండా వేర్వేరుగా ఉండటం బట్టి వాటి వయసును అంచనా వేస్తున్నారు. హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకులు చిరుతల కారణంగా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నప్పటికి ఇంతవరకు మనుషులకు ఎలాంటి హాని కలగకపోవడంతో ఆ వైపుగా ఆందోళన లేదు. దట్టమైన హార్సిలీహిల్స్ అటవీప్రాంతం సరిహద్దు, కర్ణాటకలోని రాయల్పాడు అటవీ ప్రాంతాలు కలిసిపోయి ఉంటాయి. అత్యధిక విస్తీర్ణం కలిగిన అడవిలో చిరుతల సంచారం, వాటి సంతతి పెరిగినట్టు అటవీశాఖ లెక్కలు వేస్తోంది.

2011లోనే నాలుగు చిరుతలు

2011లో హార్సిలీహిల్స్ అడవిలో నాలుగు చిరుతలు సంచరిస్తున్నట్టు అధ్యయనం ఆధారంగా గుర్తించారు. వీటిలో ఒక ఆడ, ఒక మగ చిరుత, రెండు చిరుత పిల్లలుగా నిర్ధారించారు. చిరుతల పాదముద్రల ఆధారంగా లెక్క తేల్చారు. తర్వాత నాలుగేళ్లకు నిర్వహించిన అధ్యయనంలో ఒకటి మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. మిగిలిన మూడు చిరుతలు ఇక్కడి నుంచి సత్యసాయి జిల్లాకు లేదా కర్ణాటకలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయి ఉంటాయని అటవీశాఖ భావించింది. హార్సిలీహిల్స్ తూర్పున కురబలకోట మండలం తెట్టు, దక్షిణాన కర్ణాటకలోకి రాయల్పాడు. పడమర గట్లమీద పల్లె, మొటుకు, మొగసాలమర్రి, చలిమామిడి వరకు విస్తరించి ఉంది. 1882లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించిన మేరకు 6,231 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ఇదికాక ఏ రిజర్వ్‌ఫారెస్ట్ 1,348 హెక్టార్లు, బీ రిజర్వ్ ఫారెస్ట్ 1,176 హెక్టార్లు కలుపుకొని మొత్తం 8,755 హెక్టార్లలో దట్టమైన అడవి విస్తరించింది. దట్టమైన అడవి కారణంగా చిరుతల సంఖ్య నాలుగుకు పెరిగినా తర్వాత ఒక చిరుత మాత్రమే ఆవాసం చేసుకొన్నట్టు గుర్తించారు. కాండ్లమడుగు బీటులో చిరుత పులి పాదాన్ని గుర్తించి వయసు 8 ఏళ్లు ఉంటుందని లెక్క గట్టారు. చిరుతలు తమ ఆవాసాన్ని మార్చుకొన్నట్టు అప్పట్లో అటవీ అధికారులు నిర్ణయానికి వచ్చారు.

ఇప్పుడు ఐదుకు పెరిగాయి

సాధారణంగా చిరుతలు100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సంచరిస్తుంటాయని అటవీ అధికారులు చెబుతున్నారు. దీన్ని పరిశీలిస్తే..హార్సిలీహిల్స్ అడవికి సమీపంలో బత్తలాపురం సంద్రడివి, అక్కడి నుంచి సత్యసాయి జిల్లాలో అడవులు ఉన్నాయి. కొండకు ఆనుకునే కర్ణాటక అటవీ ప్రాంతం అత్యధికంగా ఉంది. దీనితో చిరుతలు అటు ఇటు సంచరిస్తూ మళ్లీ హార్సిలీహిల్స్ అడవిలోకి వచ్చాయని కూడా భావిస్తున్నారు. ఇక్కడ చిరుతల సంఖ్య పెరగడానికి అధికారుల అంచనా ప్రకారం హార్సిలీహిల్స్ అడవిలో వన్యప్రాణుల సంఖ్య అత్యధికంగా ఉంది. వాటికి అవసరమైన ఆహారం వేటాడేందుకు ఇవి సరిపోతాయి. ముఖ్యంగా కణితలు, దుప్పులను చిరుతలు అధికంగా వేటాడతాయి. ఇప్పటి వరకు సందర్శకులకు కనిపించిన చిరుతల ఎత్తు, వాటి లావును బట్టి విశ్లేషిస్తున్న అటవీశాఖ అధికారులు చెబుతున్నదేమిటంటే..ఒక ఆడ, మగ చిరుత కచ్చితంగా ఉన్నాయని, మిగిలినవి వాటి సంతానం కావచ్చు కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే చిరుతల సంచారం పెరిగిన కారణంగా సందర్శకులు రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా బైక్‌పై వచ్చే సందర్శకులు చీకటి పడకముందే వెళ్లిపోవాలని సూచిస్తున్నారు.

ఇప్పటిదాకా భయం లేదు

సందర్శకులకు కనిపిస్తున్న దాన్ని బట్టి హార్సిలీహిల్స్ అడవిలో చిరుతల సంఖ్య ఐదుకు పెరిగిందన్న అంచనాకు వచ్చాం. ఏయే వన్యప్రాణులు ఉన్నాయి, వాటి సంఖ్యను లెక్కించే ప్రక్రియ మార్చి తర్వాత ప్రారంభం కానుంది. అప్పటికి చిరుతల సంఖ్య పెరగవచ్చని భావిస్తున్నాం. ఇవి మనుషులపై దాడి చేయకపోవడం శుభపరిణామం. ఒక్కసారి మనిషిపై దాడికి పూనుకుంటే ఇక తీవ్రమైన పరిస్థితులు నెలకొంటాయి. పర్యాటకులు సాయంత్రం, రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలి.

– అడపా శివకుమార్, సెక్షన్ ఆఫీసర్, హార్సిలీహిల్స్

ఆ అవ్వే మరణిస్తే.. ఆ బిడ్డలకు దిక్కెవ్వరు!

- 17 ఏళ్ల క్రితం భర్త అకాల మరణం
- నాలుగేళ్ల క్రితం కరోనాతో ఒక్కగానొక్క కుమార్తె మృతి
- కుమార్తె మృతి చెందిన మూడు నెలలకే పిల్లలను వదిలి అల్లుడు పరార్
- ఆదుకునే వారి కోసం ఓ వృద్ధురాలి ఎదురుచూపు



మనవరాలు, మనవళ్లతో మెహరున్నీసా

పెద్దతిప్పసముద్రం : జీవిత చరమాంకంలో కన్నబిడ్డల వద్ద కాలం వెళ్లదీద్దామని కన్నవాళ్లు ఎన్నో కలలు కంటారు. కానీ దురదృష్టవశాత్తు తోడూ నీడ లేని ఓ నిరుపేద పండుటాకు ఇంతటి వృద్ధాప్యంలోనూ అమ్మానాన్నలకు దూరమైన ముగ్గురు పిల్లల బాధ్యతను మోస్తూ.. కనాకష్టంగా బతుకీడుస్తూ ఆదుకునే వారి కోసం ఆశగా ఎదురు చూస్తోంది. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఓ వృద్ధురాలి వ్యథాభరిత గాథ ఇది.. జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్త అకాల మరణం చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమార్తెకు వివాహం చేస్తే నాలుగేళ్ల క్రితం ఆమె కరోనాతో మృతి చెందింది. ఆ వెంటనే అల్లుడు సైతం కన్నబిడ్డలను వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో కుమార్తెకు కలిగిన ముగ్గురు పిల్లలను పోషించేందుకు ఈ పండుటాకు పడుతున్న కష్టాన్ని చూసిన వారు అయ్యో.. ఆ అవ్వే మరణిస్తే.. ఆ బిడ్డలకు దిక్కెవ్వరు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దతిప్పసముద్రం మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన కలాయి పీరాన్‌సాబ్, మెహరున్నీసా దంపతులు. వీరికి రెడ్డి ప్యారీ అనే ఒక్కగానొక్క కుమార్తె సంతానం. గతంలో ఎప్పుడో మంజూరైన ఇందిరమ్మ ఇంట్లో జీవనం సాగిస్తూ వస్తున్నారు. 17 ఏళ్ల క్రితం మెహరున్నీసా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త అకాల మరణం, మరో వైపు పెళ్లీడుకొచ్చిన కుమార్తె వివాహం ఎలా చేయాలో దిక్కుతోచక ఆమె లోలోపలే కుమిలిపోయింది. ఈ నేపథ్యంలో కూలీ, నాలీ చేసి అతి కష్టంతో 13 ఏళ్ల క్రితం కుమార్తె రెడ్డిప్యారీకి షఫీ అనే వ్యక్తితో వివాహం జరిపించింది. వీరికి రేష్మా, రెడ్డిబాషా, షఫీ అనే ముగ్గురు సంతానం. దినసరి కూలి పనులు చేసుకుంటూ కుమార్తె, అల్లుడు పెద్దతిప్పసముద్రంలోనే జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల క్రితం కుమార్తె రెడ్డిప్యారీని కరోనా మహమ్మారి కబళించింది. ఆమె మృతి చెందిన మూడు నెలలకే ముగ్గురు పిల్లలను వదిలి ఆమె భర్త షఫీ ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన ఆ పిల్లలను అమ్మమ్మ దరి చేర్చుకుంది. ముగ్గురు పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో చేర్పించింది. ప్రభుత్వం ఇచ్చే యూనిఫారం.. లేదంటే చిరిగిన.. చాలీచాలని పాత దుస్తులే ఆ పిల్లలకు దిక్కు.. వారికి ఓ పుట్టిన రోజు లేదు.. ఓ పండుగ లేదు.. ఒకవేళ ఏ జ్వరమో వస్తే మందులషాపులో టాబ్లెట్‌లు కొనుక్కునే స్తోమత కూడా లేదు. ఏ పూటకాపూట కడుపు నింపుకోవడమే కష్టంగా అర్ధాకలితో అలమటిస్తున్న ఈ చిన్నారుల దీన స్థితిని కళ్లారా చూసిన వారు అయ్యో.. అంటూ జాలిపడుతున్నారు. ఆ పండుటాకుకు ప్రభుత్వం నుంచి వచ్చే నెలవారి పింఛన్, రేషన్ సరుకులే జీవనాధారం. అయినా కష్టాలను.. కన్నీళ్లను దిగమింగుతూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. తన ఊపిరి ఎప్పుడు ఆగిపోతుందో, ఈ పిల్లలు ఎక్కడ అనాథలు అయిపోతారో, వారి బాగోగులు ఎవరు చూసుకుంటారో అంటూ ఈ అవ్వ దిగులు పడుతూ కంటతడి పెడుతుంటే ఆ మాటలు విన్న వారి హృదయం తరుక్కుపోతోంది. ఇంతటి కష్టంలోనూ ఆ అవ్వ ఓ అంత్యోదయ కార్డు మంజూరు చేయమని.. అభం శుభం తెలియని తన పసి పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇవ్వమని మాత్రమే వేడుకుంటోంది. అటు ప్రభుత్వం.. ఇటు మానవతావాదులు స్పందించి కష్టాల కడలి నుంచి ఆ కుటుంబాన్ని గట్టెక్కించాల్సిన అవసరం ఉంది.

నేడు ఉద్యానశాఖ డైరెక్టర్ క్షేత్ర పర్యటన

బి.కొత్తకోట : రాష్ట్ర ఉద్యానవనశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు మండలంలోని కోటావూరు గ్రామానికి చేరుకుని ఇక్కడ డ్రాగన్ పంటను సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖ మాట్లాడతారు. అనంతరం గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం అవుతారు. తర్వాత గట్టు, బయ్యప్పగారిపల్లె గ్రామాల్లో మామిడి, అవకాడో సాగును పరిశీలిస్తారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని కాయలవాండ్లపల్లెలో రోజా పూల సాగు, మద్దయ్యగారిపల్లెలో రైతులతో ముఖాముఖి, రైతు ఉత్పత్తిదారుల సంఘంతో సమావేశాలు నిర్వహించి రీలింగ్ యూనిట్‌ను సందర్శిస్తారు. తర్వాత ములకలచెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశీలిస్తారు.

గృహ నిర్మాణం, లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత

ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజాబాబు



గాలివీడులో అధికారులతో చర్చిస్తున్న హౌసింగ్ ఎండీ, జిల్లా కలెక్టర్

రాయచోటి/గాలివీడు : జిల్లాలోని అన్ని లే అవుట్లలో గృహ నిర్మాణ పూర్తికి, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజాబాబు, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు లబ్ధిదారులతో పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలోని హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ లేఅవుట్లలో ఉన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వారు చర్చించారు.

లేఅవుట్ల పరిశీలన

రాయచోటి మండలం దిగువ అబ్బవరం ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఉన్న లేఅవుట్లు, అలాగే గాలివీడు మండలం గుర్రాలమిట్ట ఉర్దూ పాఠశాల ఎదురుగా ఉన్న హౌసింగ్ లేఅవుట్‌లను జిల్లా కలెక్టర్, గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. స్థానికంగా నివాసం ఉన్న లబ్ధిదారులతో సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య, అంతర్గత రోడ్ల సమస్యలను లబ్ధిదారులు వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శివయ్య, ఈఈలు, డీఈఏలు, ఏఈలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : జిల్లాలో గిరిజనులు, వారి నివాస ప్రాంతాల అభివృద్ధికి పక్కాగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం మంతన్ శివిర్‌లో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో దర్తీ ఆభా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద జిల్లా మంతన్ సివిర్ సమావేశం నిర్వహించాలని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమం క్రింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారి, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య, ఆరోగ్య, డీఆర్‌డీఏ, డ్వామా, పంచాయతీ, ఐసీడీఎస్, ఫిషరీస్ తదితర శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి

బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమన్వయ కమిటీ ప్రత్యేక సమావేశాన్ని జిల్లా బీసీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు తదితర వివరాలను జిల్లా కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బీసీ కార్పొరేషన్లను, ఆర్థికంగా వెనుకబడిన వివిధ వర్గాల వారి కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందన్నారు. వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు సహకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎల్‌డీఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వృద్ధుడి మృతి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. డిసెంబర్ 23న చౌడేపల్లె మండలం కాటిపేరి పంచాయతీ పెద్దగొన్నికుంట గ్రామానికి చెందిన లక్ష్మన్న(60) మరో వ్యక్తితో కలిసి వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. రాత్రి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా, బైపాస్‌రోడ్డులోని వెన్నెల రెస్టారెంట్ సమీపంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మన్న తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అత్యాచార బాధితులకు వైద్యపరీక్షలు

మదనపల్లె : కన్నతండ్రి చేతిలో అత్యాచారానికి గురైన బాధిత పిల్లలకు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మంగళవారం వైద్యచికిత్సలు నిర్వహించారు. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్యనారాయణ మదనపల్లెకు చేరుకుని ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడారు. అనంతరం నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు వెళ్లి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా

రైల్వేకోడూరు అర్బన్ : ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పటిష్టం చేసి, అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పరిధిలోని శేషాచలం అటవీ పరిధిలో వారు తనిఖీలు నిర్వహించారు. అలాగే అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయింట్ల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బాలిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అధికారులు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కళలు, సంప్రదాయాలు కాపాడుకోవాలి

రాయచోటి అర్బన్ : కళలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డైట్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. విజేతలకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు రంగోత్సవ్ పోటీలు ఒక వేదిక లాంటివి అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డైట్ కళాశాల అధ్యాపక బృందం శివ భాస్కర్, శ్రీదేవి, అసదుల్లా, నాగరాజు, నాగేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీల విజేతలు

జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు మొత్తం 8 విభాగాల్లో జరిగాయి. క్విజ్ పోటీలలో హానీషా విజేతగా నిలిచారు. ఇక డ్రాయింగ్ విభాగంలో ఎస్ఎండీ తౌసిఫ్, చేతిరాతలో భవ్యశ్రీ, రంగోళిలో ఎం.ఐశ్వర్య, జానపద నృత్యంలో నాగ నిషిత బృందం, డిజిటల్ కోల్లాజ్‌లో హర్షిత, స్లోగన్ రైటింగ్‌లో ప్రవళిక, రోల్‌ప్లేలో జె.చైతన్య నిలిచారు. వీరికి డైట్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రతి విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు జనవరి 24న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ తెలిపారు.

రెడీమేడ్ సంక్రాంతి

- ఇప్పుడు పేడనీళ్ల కలర్, ఎర్రమట్టితో సహా..
- అన్నీ మార్కెట్‌లో లభ్యం



ఎర్రమట్టి, ఇసుకతో కలిపిన రంగులు

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో తెలుగువారికి అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఒకప్పుడు ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సంక్రాంతి సందడి ప్రారంభమయ్యేది. అప్పట్లో పల్లెలు, పట్టణాల్లో సైతం పశుసంపద ఉండేది. ఎక్కువ శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవించేవారు. ఈ కారణంగా అన్నీ కూడా ప్రకృతి సహజసిద్ధంగా లభించేవి. అయితే ప్రస్తుతం ప్రజలు సాంకేతికత వైపు పరుగులు పెడుతూ జీవనం సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా కొద్ది మంది మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల ప్రకృతి సహజసిద్ధమైనవి లభించడం లేదు. దీనికితోడు ప్రజల జీవన శైలిలో కూడా గణనీయమైన మార్పులు వచ్చి ఆధునికతవైపు అడుగులు వేస్తున్నందువల్ల క్షణం తీరిక లేకుండా గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ చాలా మంది ఇప్పటికీ సంక్రాంతి సంప్రదాయాలు పాటిస్తున్నారు. అందులో భాగంగా మార్కెట్‌లో లభించే రెడీమేడ్ వస్తువులతోనే సంక్రాంతి సంప్రదాయాన్ని కొనసాగిస్తుండటం విశేషం. అందువల్ల ఇప్పుడు సంక్రాంతి రెడీమేడ్ సంక్రాంతి అయిందని చెప్పవచ్చు.

పేడకు బదులు రంగుపొడర్

ఒకప్పుడు ఇంటి ముంగిట పేడనీళ్లు చల్లి ముగ్గులు వేసేవారు. అయితే ఇప్పుడు పశుసంపద తక్కువయినందున పట్టణాల్లోనే కాక అనేక గ్రామ సీమల్లో సైతం పేడ దొరకని పరిస్థితి నెలకొంది. అందువల్ల వ్యాపారులు పేడనీళ్లను తలపించేలా పౌడర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకరోజుకు సరిపోయే పేడ కలర్ నాణ్యతను బట్టి పాకెట్ 5 నుంచి 10 రూపాయిలకు విక్రయిస్తున్నారు. అందువల్ల పట్టణ ప్రజలే కాక గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం పేడరంగు పొండర్‌ను తెచ్చుకొని తమ ఇంటిలోగిళ్లను అలంకరించుకుంటున్నారు. అలాగే ఎర్రమట్టి, ముగ్గుపిండి సైతం మార్కెట్‌లో లభిస్తున్నాయి.

పిండి వంటలు కూడా అంతే..

ఇదివరకు జనవరి నెల తొలివారం నుంచి ప్రతి చోట పిండి వంటల వాసన గుభాళించేది. అయితే ఇప్పుడు పట్టణ ప్రాంతాల ప్రజలు సంక్రాంతి స్పెషల్ స్వీట్స్ ఇంటిలో చేసుకోవడం చాలా తక్కువయింది. అందువల్ల సంక్రాంతి స్పెషల్ స్వీట్స్ అయిన నిప్పట్లు (అత్తిరాసలు), కర్జికాయలు, లడ్లు, బియ్యం, శెనగపిండి కారాలు ఇలాంటి వాటిని వ్యాపారులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ పండి వంటలను పట్టణ ప్రజలు కొనుగోలు చేసి రుచిని ఆస్వాదిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మాత్రం తమ పిల్లలు, బంధువుల కోసం స్వయంగా తయారు చేసుకుంటుండటం విశేషం.

దుస్తుల గురించి చెప్పక్కర్లేదు

పెద్దపండుగ అయిన సంక్రాంతికి పేదలు సైతం కొత్త దుస్తులు ధరిస్తారు. అయితే 95 శాతం మంది యువతి, యువకులు, పురుషులు ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం అలాగే లేటెస్ట్ మోడల్స్ కోసం రెడీమేడ్ దుస్తులనే కొనుగోలు చేస్తున్నారు.



పేదరంగు పొడర్ ప్యాకెట్లు



ప్యాకెట్లలో దొరికే ముగ్గుపిండి

విక్రయాలు బాగున్నాయి



పేడ రంగు కలర్, ఎర్రమట్టి, ముగ్గుపిండి, ఇసుకలో కలిపిన రంగులకు మంచి డిమాండ్ ఉంది. గత వారం రోజుల నుంచి ఎక్కువగా ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు మరో వారం రోజుల సమయం ఉన్నందున వీటి విక్రయాలు ఇంకా ఎక్కువగా ఉంటాయి. అందువల్ల ఖర్చులు పోను అంతో ఇంతో మిగులుబాటు అయ్యే అవకాశం వుంది.

– నారాయణ, వ్యాపారి, రాజంపేట

దేవాలయ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గుర్రంకొండ : మర్రిపాడు గ్రామంలో కాటమరాజు గుడి స్థలం ఆక్రమణపై గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని లిఖిత పూర్వకంగా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 717/2సీలో 1.50 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు పసలమంద మాన్యంకు కేటాయించారన్నారు. ఇందులోని కాటమరాజు గుడి వద్ద ఏటా సంక్రాంతి పండుగ రోజున పశువులను తిప్పుతారని అన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు కాటమరాజు గుడి స్థలాన్ని ఆక్రమించుకొని ఇనుప కంచె వేసుకొన్నారని ఫిర్యాదు చేశారు. పశువులు గుడి చుట్టూ తిరగాలంటే ఇనుప కంచె అడ్డంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన గుడి స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని వారు కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సంబేపల్లె : వివిధ రకాల అనారోగ్యాలతో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు రోగులు వస్తారని, వారికి అందుబాటులో వుండాలని అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లె మండల పరిధిలోని దేవపట్ల ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశాలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గర్భవతుల వైద్యం, ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రసవాలపై ఆరా తీశారు. చిన్నారులకు వేస్తున్న టీకాలపై వైద్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పడకేసిన అభివృద్ధి, సంక్షేమం

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పడకేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2019–2024 మధ్యలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ.. సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా చేపట్టారని తెలిపారు. పేద ప్రజలకు ఏమి అవసరమో అన్నీ ఇంటి వద్దకే అందిస్తూ పాలన సాగించారన్నారు. ఇక తనకు, తన పార్టీకి భవిష్యత్తు ఉండదనే ఆలోచనతో పేద ప్రజలు, రైతులు, ఉద్యోగస్తులు, యువకులకు ఎన్నికల ముందు కుట్ర పూరిత, అబద్ధాల హామీలు ఇచ్చిన చంద్రబాబు సీఎం అయ్యారని పేర్కొన్నారు. కానీ అధికారం చేపట్టాక అన్ని వర్గాల వారిని నయవంచనకు గురి చేశారని విమర్శించారు. యువకులకు ఉద్యోగాలు ఇస్తానని ఉన్న ఉద్యోగాలు పీకేసారని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని, రైతులకు పథకాలు అందించలేదన్నారు. అలాగే ఆరోగ్య శ్రీ, అమ్మ ఒడి, రైతుభరోసా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా అన్ని పథకాలు ఆపేశారని అన్నారు. అవేకాక అన్ని రకాల సరుకులు, ఎరువుల ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందించకుండా నియంతలా పాలన అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. అప్పులు చేసినా ప్రజలకు హామీలు, పథకాలు అమలు చేయకుండా నిత్యం అపద్ధాలు చెప్పే ఏకైక ముఖ్యమంత్రి దేశంలో చంద్రబాబు ఒక్కడేనని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ మహిళలకు, పేదల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఉసురు చంద్రబాబుకు తగలక తప్పదని అన్నారు. అదే గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. చార్జీలు పెంచకుండా విద్యుత్ రంగం, పోర్టులు, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలు అభివృద్ధి చేశారన్నారు. పేద ప్రజలకు గృహాలు, విద్య, ఆరోగ్యం, పథకాలు అందించడమే కాక కరోనా కష్ట కాలంలో ప్రజలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపాడుకొన్నారని అన్నారు. నిజమైన పాలకులు ప్రజలపై భారం మోపకుండా వారికి అన్ని రకాలుగా మేలు చేస్తారని తెలిపారు. భారం మోపకుండా ప్రజలకు మేలు చేసే పరిపాలన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు అనుభవివించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పంజం సుకుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల ప్రారంభం

ఏయూ క్యాంపస్‌లో అంబరాన్ని అంటిన సంబరాలు



జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట : ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏయూ క్యాంపస్ ఆవరణలో అత్యంత సుందరోపేతంగా వేదికను నిర్మితం చేశారు. తొలిరోజు వేదికపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సి.రామచంద్రారెడ్డి, రాజంపేట ఎస్‌డీపీఓ సుధాకర్, ఏయూ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేశారు. రజిత వేడుకలు అంబరాన్ని తాకాయి. అనంతరం సభను ఉద్దేశించి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఏఐటీఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని రాజంపేట ప్రాంతానికే వన్నె తెచ్చిందన్నారు. ఉన్నత విద్యకు రాజంపేట ఒక వేదికగా మారింది అంటే అందుకు కారణం చొప్పా గంగిరెడ్డి అన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యాసమాజం బలోపేతం కావాలన్నదే ఏఐటీఎస్ లక్ష్యంగా కొనసాగిందన్నారు.

అలరించిన సంగీతం

ప్రఖ్యాత సంగీత కళాకారుడు రామ్ మ్యూజికల్ కన్సర్ట్ అలరించింది. మ్యూజికల్స్ వేడుకను విద్యార్థులు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ నారాయణ, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జయరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ ఎం.సుబ్బారావు, డీన్స్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల వర్క్‌షాప్‌లను నిర్వహించారు. పరిశ్రమల పరిజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకత వంటి అంశాలపై విద్యార్థులకు నిపుణులు అవగాహన కల్పించారు. వారిలో రెడ్డప్పనాయుడు, కిరణ్‌రావు, రమణారెడ్డి, మల్లాడి, రమేష్‌బాబు, భరద్వాజ్, జగదీష్, నిహారిక, సుదీర్ సాండ్రాలు ఉన్నారు. పలు సంగీత కార్యక్రమాలు అలరించాయి.



ఏఐటీఎస్ సిల్వర్‌జూబ్లీ వేదికపై అలరించిన సంగీత నృత్యం

మూడుకు చేరిన మృతుల సంఖ్య

108 వాహనం ఢీకొన్న ప్రమాదంలో..



పెద్దరెడ్డెమ్మ (ఫైల్)



లక్ష్మమ్మ (ఫైల్)



తులసమ్మ (ఫైల్)

రామసముద్రం : తిరుమలకు కాలినడకన వెళుతున్న భక్తులను 108 అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ సింగంవారిపల్లె, చింపరపల్లెకు చెందిన సుమారు 40 మంది భక్తులు ఈ నెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశికి శ్రీవారిని దర్శించుకోవాలని గ్రామం నుంచి కాలినడకన తిరుపతికి బయలుదేరారు. మార్గంమధ్యలో సోమవారం వేకువజామున చంద్రగిరి నియోజకవర్గం నరసింగాపురం వద్ద నడచివెళుతుండగా, మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి తిరుపతి రుయాకు రోగిని రెఫర్‌పై తీసుకెళుతున్న 108 అంబులెన్స్ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ప్రమాదంలో చింపరపల్లెకు చెందిన పెద్దరెడ్డెమ్మ(40), సింగంవారిపల్లెకు చెందిన లక్ష్మమ్మ(45) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలతో తిరుపతి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించిన తులసమ్మ(45) మంగళవారం మృతి చెందింది. కాగా, సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరామర్శించారు. మృతుల దహన ఖర్చుల కోసం ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలను ఆదుకునే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా శివప్రసాద్‌రెడ్డి (రైల్వేకోడూరు), మహిళా విభాగం అధ్యక్షురాలిగా జి.షమీమ్ అస్లం (మదనపల్లె), బీసీ విభాగం అధ్యక్షుడిగా యు.సాంబశివ (తంబళ్లపల్లె), ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఆర్.కమలాకర్ (రాజంపేట), ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చంద్రానాయక్ (రాజంపేట), మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా మహమ్మద్ ఖాన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా జె.కిశోర్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా పి.ఫయాజుర్ రెహ్మాన్ (రాయచోటి), వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా కె.వేణుగోపాల్, చేనేత విభాగం అధ్యక్షుడిగా ఎస్.రమేష్‌బాబు, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా పాల్ చంద్రశేఖర్, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌రెడ్డి (మదనపల్లె), దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా రెడ్డెప్ప (పీలేరు), వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా బి.నరేష్‌కుమార్, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా జె.వెంకటరెడ్డి, లీగల్‌సెల్ అధ్యక్షుడిగా ఎస్.అనుదీప్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎస్.నవీన్‌కుమార్, సమాచారహక్కు చట్టం విభాగం అధ్యక్షుడిగా సి.హరీష్‌కుమార్, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా ఎస్‌కే నాయబ్ రసూల్, బూత్ కమిటీ అధ్యక్షుడిగా నడివీధి సుధాకర్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా ముకుందపురం నరేష్ (రాజంపేట), అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలిగా కసిరెడ్డిగారి సాహితి (పీలేరు)లను నియమించారు.

టీడీపీ వర్గీయుల గుప్పిట్లో వసతి గృహాల టెండర్లు

- ప్రొవిజన్స్, కూరగాయల సరఫరాకు ఆహ్వానం
- డీఈఓ కార్యాలయంలో అధికార పార్టీ శ్రేణుల హల్‌చల్

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలోని కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రొవిజన్స్, కూరగాయలు ఇతర సరుకుల పంపిణీకి జరిగిన టెండర్ల ప్రక్రియ టీడీపీ వర్గీయుల గుప్పెట్లో సాగింది. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటి డీఈఓ కార్యాలయంలో జిల్లాలోని 25 కస్తూరి గాంధీ గురుకుల విద్యాలయాలు, 15 ఏపీ మోడల్ స్కూల్స్‌కు సరుకుల చేరవేత టెండర్లను నిర్వహించారు. వసతిగృహాలకు ప్రొవిజన్స్, కూరగాయలు, కందిబేడలు, నూనె, కోడిగుడ్లు, చికెన్ అందించేందుకు ఈ టెండర్లను ప్రభుత్వం పిలిచింది. ఈ టెండర్ల నిర్వహణలో కూటమి ప్రభుత్వంలో భాగమైన టీడీపీ నాయకులు ఇతరులను ఎవ్వరినీ టెండర్లు వేయనీయకుండా డీఈఓ కార్యాలయంలో హల్‌చల్ చేశారు. టెండర్ల ప్రాంగణం టీడీపీ వర్గీయుల గుప్పిట్లో ఉండిపోయింది. పోలీసులు బందోబస్తు నిర్వహించినా వారు ప్రేక్షకపాత్ర పోషించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ టెండర్లు తమ అనుయాయులకు మాత్రమే చెందాలని, ఇతరులు ఎవరూ టెండర్లు వేయడానికి వీలులేదని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ ఒక్కో షెడ్యూల్ రూ.5 వేల వంతున 30 షెడ్యూల్స్‌ను కొనుగోలు చేశారు. షెడ్యూల్స్‌ను కొనుగోలు చేసిన ముగ్గురు టెండర్లు వేయడానికి డీఈఓ కార్యాలయం ఆవరణలోకి వెళ్లగానే.. టీడీపీ వర్గీయులు కోపోద్రిక్తులై షెడ్యూల్స్‌ను లాగి చించివేయడంతోపాటు వారిని బయటకు గెంటివేశారు. దీంతో టెండర్ షెడ్యూల్స్‌ను కొనుగోలు చేసిన వారు దాఖలు చేయడానికి లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో షెడ్యూల్‌ను కొనుగోలు చేసిన వారు టీడీపీ నాయకుల దౌర్జన్యానికి చేసేది లేక వెనుతిరగాల్సి వచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు అందించే సరుకుల విషయంలో అధికార పార్టీ నాయకుల దౌర్జన్యంపై స్థానికులు మండిపడుతున్నారు.

టీడీపీ అనుయాయుల షెడ్యూల్స్ మాత్రమే దాఖలు

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన టెండర్లలో టీడీపీ వర్గీయులకు చెందిన మూడు టెండర్లు మాత్రమే దాఖలైనట్లు సమాచారం. తిరుపతికి చెందిన రెండు క్యాటరింగ్‌ల పేర్లతోనూ, కడపకు చెందిన మరో క్యాటరింగ్ సంస్థ పేరుతో మాత్రమే దాఖలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ మూడు షెడ్యూల్స్ టీడీపీ వర్గీయులకు చెందినవారే. వారికి అనుకూలంగా టెండర్‌ను దక్కించుకునేలా దాఖలు చేసుకున్నట్లు తెలిసింది.

30 షెడ్యూల్స్ అమ్ముడుపోయాయి

వసతిగృహాలకు ప్రొవిజన్స్, ఇతర సరుకుల సరఫరా కోసం నిర్వహించిన టెండర్ల షెడ్యూల్స్ 30 అమ్ముడుపోయాయని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. ఈ టెండర్ల ప్రక్రియ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించామన్నారు. ఎన్ని టెండర్లు దాఖలు అయింది. బుధవారం జేసీ కార్యాలయంలో ఓపెన్ చేసే వరకు తెలియదు అన్నారు.

జ్యువెలరీ షాప్‌లో కి'లేడీల' మాయాజాలం

రాజంపేట : రాజంపేటలో మంగళవారం ఏకే జ్యువెలరీ షాప్‌లో ఇద్దరు కి'లేడీ'లు మాయాజాలం ప్రదర్శించారు. వారిద్దరు దర్జాగా జ్యువెలరీ షాపులోకి వచ్చారు. సిబ్బందితో బేరసారాలు కొనసాగించారు. నకిలీ బంగారు వెంట తెచ్చుకున్నారు. ముందుగా అనుకున్నట్లే రూ.1.75 లక్షల విలువ చేసే పాతబంగారం అని చెప్పి, నకిలీ బంగారాన్ని అందజేశారు. ఈ బంగారానికి బదులు కొత్త ఆభరణాలు తీసుకున్నారు. వెంటనే షాపులో నుంచి ఉడాయించారు. ఆ బంగారాన్ని దుకాణం వారు నిశితంగా పరిశీలించారు. నకిలీదని గుర్తించారు. కిలేడీలు ఎవరన్నది సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. దీంతో తాము మోసపోయామని జ్యువెలరీ షాపు యజమాని వాపోయారు.